


'టంగ్... టంగ్... గడియారం లెక్క పెట్టి మరీ ఏడు కొట్టింది.

'అమ్మో... అప్పుడే ఏడైపోయిందా? అసలే ఆఫీసరు పీనుగ మండిపడుతున్నాడు రోజూ లేటవుతోందని.. .! ఈ రోజేమైనా సరే- పదికి పది నిమిషాల ముందు ఆఫీసులో వుండాల్సిందే' కళ్ళు నులుముకుంటూ కంగారుగా నిద్ర లేచాడు సుబ్బారావు.

'బర్... బర్...' కాలింగ్ బెల్ గోల చేసింది.

# నమస్కారం!

'పొద్దున్నే ఎవరొచ్చార్రా దేవుడా...' అనుకుంటూ సుబ్బారావు తలుపు తీశాడు.

ఎదురుగా- నుదిటిన నామాలతో, పట్టు పంచె కట్టుతో, చేతిలో పళ్ళెంతో, ఆ పళ్ళెంలో ప్రసాదంతో ప్రత్యక్షమయ్యాడు రామాచారి వినయంగా నమస్కారం చెబుతూ.

"నమస్కారం... రండి... రండి... ఏంటిలా వచ్చారు"

'అబ్బే... ఏం లేదండీ... ఏదో ప్రసాదం ఇచ్చి పోదామనీ"

"తెలుసా మనం ఎవరం...? భారతీయులం కదా! మన సంప్రదాయం 'దేవుణ్ణి' ఆరాధించడం, మంచిని గౌరవించడం. అందుకే మంచిని ప్రోత్సహించమని కోరుకుంటూ మీబోటి భక్తులందరికీ ప్రసాదాలిస్తున్నాం."


'చాలా సంతోషమండీ' పొద్దున్నే దేవుడి ప్రసాదం లభించింది కాబట్టి, ఆఫీసరు ఛండామార్కుడు కూడా కరుణిస్తాడన్న నమ్మకం సుబ్బారావుకి కలిగి తెగ సంబరపడిపోయాడు.

"అసలు- రాముడున్నాడు చూశారూ- తండ్రి మాట కోసం అడవులకెళ్ళాడు. ఒక్క భార్య మాత్రమే చాలన్నాడు. తనది ఒక్క మాటేనన్నాడు. శత్రువుని సైతం తన చేతులతో హతమార్చి పుణ్యం ప్రసాదించాడు. ఇంక సీతమ్మోరు! ఆమె మహా పతివ్రత? ఇంక ఆంజనేయస్వామి. మహాభక్తుడు. ఇకపోతే...." మొత్తం రామాయణమంతా వీలైనంత క్లుప్తంగా ఓ రెండు గంటలసేపు వినిపించాడు రామాచారి.

గడియారం తొమ్మిది కొట్టింది.

"మీకాఫీసుకు టైమవుతున్నట్టుంది. ఇంక నే పోయొస్తా: రేపు మళ్ళీ ప్రసాదం తెస్తా లెండి... నమస్కారం" అంటూ రామాచారి పంచె సర్దుకుంటూ పక్కింటికెళ్ళాడు.

'అమ్మబాబోయ్. ఆఫీసరు ఏమంటాడో' అనుకుంటూ బాత్రూంలో దూరాడు సుబ్బారావు.




* * *

'పది దాటిపోతోంది... లేటయిపోయింది... ఆ ఆఫీసరు పీనుగ ఏం అరచి గోల చేస్తాడో...' హడావిడిగా సైకిలెక్కబోతున్న సుబ్బారావును "నమస్కారమండీ" వినయంగా పలుకరించిందో గాంధీ టోపీ.

ఖద్దరు దుస్తులతో, హుందాగా, పెద్దమనిషి తరహాగా వున్న గాంధీ టోపీ గారిని చూసేసరికి సుబ్బారావు సైకిల్ స్టాండ్ వేసి "రండి... రండి..." అంటూ లోపలికి దారి తీశాడు. "ఏంటిలా వచ్చారు... ఏమన్నా విశేషమా..." అని అడిగాడు, కూర్చోడానికి కుర్చీ చూపిస్తూ.

"మా గురించీ, మా పార్టీ గురించీ మీకు తెలియంది ఏమీ లేదు. మనమంతా భారతీయులం. గాంధీ పుట్టిన దేశం మనది. మన దేశ ప్రప్రథమ ప్రధాని నెహ్రూగారు మన దేశం కోసం ఎంతో చేశారు. ఆయన కుమార్తె ఇందిరాగాంధీ గారు దేశం కోసం అవిశ్రాంతంగా కృషి చేశారు. అలాగే రాజీవ్ గాంధీగారు దేశం కోసం విశేషంగా కృషి చేశారు. అసలు నెహ్రూ గారి కుటుంబమే దేశసేవకు అంకితమయ్యింది. విభిన్న మతాలు; విభిన్న కులాలు; విభిన్న జాతులు కేవలం మన దేశంలో మాత్రమే స్వేచ్ఛగా మనుగడ సాగిస్తున్నాయి. దేశ సమైక్యత కోసం, దేశ సమగ్రత కోసం మనమంతా కలిసికట్టుగా కృషి చెయ్యవల్సిన తరుణం వచ్చేసింది. ఏమంటారు?" ఆగకుండా అరగంటసేపు సుదీర్ఘ ఉపన్యాసమిచ్చి ఓ చిన్న ప్రశ్నేశాడు టోపీవాలా.

"మీరు చెప్పేదంతా నిజమే. ఇంతకీ మీరేం చెప్పదలచుకున్నారో అది చెబితే..." అర్థోక్తిలో ఆగిపోయాడు సుబ్బారావు.

"ఇంకా మీకర్థం కాలేదా... ఎన్నికల సీజన్ వచ్చేసింది కదా... మన గురించీ, మన పార్టీ గురించీ, మన పాలసీ గురించీ మన వాళ్ళందరికీ ఏదో చెప్పుకుంటూ వస్తున్నా... అసలు మన పార్టీ చరిత్ర పరిశీలిస్తే- అదో పెద్ద కథే! అదేలా టంటే..." మరో అరగంట గడచిపోయింది.

'ఓ పక్క ఆఫీసుకు పోవాలి. ఈ పక్క గాంధీ టోపీగారు వదలరు... ఎలారా దేవుడా' సుబ్బారావు బాధ వర్ణనాతీతం.

ఎలాగైతేనేం- మరో అరగంట గడిచేసరికి - ఆ దేవుడు కరుణించాడు.

"మరింక నే వస్తానండీ. రేపు మళ్ళీ కలుస్తా. నమస్కారం..." గాంధీ టోపీ నిష్క్రమించాడు.

'అయ్యబాబోయ్... పన్నెండు దాటిపోయింది... ఇప్పుడెళ్తే మా ఆఫీసరువిప్పి లిడ

తాడో...' సుబ్బారావు సణుక్కుంటూ సైకిల్ ఎక్కబోతుండగా "అయిన ఆలస్యం ఎలాగా అయ్యింది. ఏకంగా భోజనం చేసి వెళ్ళండి. ఆఫ్ డే లీవ్ పెడితే సరి..." శ్రీమతి సలహా. తక్షణం అమల్లో పెట్టాడు.

* * *

గబగబా ఏవో నాలుగు మెతుకులు నోట్లో కుక్కుకుని ఆఫీసుకు బయల్దేరబోతూండగా– "నమస్కారం..." అంటూ గుమ్మంలో ప్రత్యక్ష మయ్యిందో గుంపు. ఆ గుంపుకు నాయకత్వం వహిస్తున్నారు ప్రముఖ సినీ నటీమణి విజయప్రమద.

యువతరం గుండెల్లో గుబులు పుట్టించే అందాల తార ఎదురుగా దర్శనమిచ్చేసరికి డంగై పోయాడు సుబ్బారావు "నమస్కారం నమస్కారం" అంటూ ఆదరంగా ఆహ్వానించాడు.

"మనం తెలుగువాళ్ళం కదండీ... అసలు తెలుగు వాళ్ళంటే ఎంత పేరు... ఎంత పేరు...! అసలు.. మన భాష ఎంత తీయనిదనీ! నన్నయ్య ఎవరు? మన తెలుగువాడు... శ్రీనాథుడు ఎవరు? మన తెలుగువాడు. అన్న ఎవరు? మన తెలుగువాడు. ఇక మీ బోటి తమ్ముళ్ళెవరు? మన తెలుగు వాళ్ళు. కాబట్టి మన తెలుగువాళ్ళమంతా కల్సి తెలుగు పౌరుషాన్ని ఎలుగెత్తి చాటాలి. నేను మీకు పెద్దగా ఏం చెప్పక్కర్లేదనుకోండి... ఏమంటారు.." గంటన్నర ఉపన్యాసం అనంతరం ఓ చిన్న ప్రశ్నేసిందామె.

అంత పెద్ద సిన్మా యాక్టరు తన ఇంటికి రావడమే కాకుండా తనతో తీరుబడిగా మాట్లాడుతూ కూర్చోవడం అతను నమ్మలేకపోతున్నాడు. ఆమె ఏం చెబ్తోందో అతనికి తెలియదు. అతని కళ్ళూ, చెవులూ, మెదడూ అన్నీ ఆమె అందాన్నే పరీక్షిస్తున్నాయి. ఆ మత్తులోనే "మీరు చెప్పింది నిజమే" అన్నాడు.

"మరింక మేం వెళ్ళొస్తాం... నమస్కారం..." ఆమె వయ్యారంగా సెలవుచ్చుకుంది. జయజయధ్వానాలు కాస్త సద్దుమణుగుతుండగా–

గడియారం నాలుక్కొట్టింది...

"ఓర్నాయినోయ్... అప్పడే నాలుగైపోయింది. పొద్దున్నా పోయె... మధ్యాహ్నమూ పోయె... ఆఫీసులో బాస్ గాడ్ని ఏ ఆడ దయ్యమన్నా పూనుతుందో ఏమో..." సుబ్బారావు హడావిడి పడిపోతున్నాడు.


## అది తెలీకనే...

ఒక పోలీస్, బీట్ చేస్తూ, ఇద్దరు మగవాళ్ళు పోట్లాడుకుంటుండగా, ఓ కుర్రవాడు "డాడీ! డాడీ!" అని ఏడుస్తుండటం చూశాడు. లాఠీ ఝుళిపిస్తూ – ఆ ఇద్దర్నీ విడదీసి...

"ఇందులో మీ డాడీ ఎవరు బాబూ?" అనడిగాడు.

"తెలీదు" అన్నాడు కుర్రవాడు ఏడుస్తూనే.

పోలీసు ఆశ్చర్యపోతూ "తెలీదా?" అని అడిగేస




"తెలీదు. నాకు డాడీ ఎవరో తెలీకనే వాళ్ళు కూడా పోట్లాడుకుంటున్నది" అన్నాడు మళ్ళీ.

"కాస్త టీ తాగేసింతర్వాత ఆఫీసుకెళ్ళి జరిగిన విషయం చెప్పి లీవు పెట్టి రండి" శ్రీమతి ఓ సలహా విసిరింది.

అతనికప్పుడు అదే మంచిదనిపించింది. అంతకంటే వేరే దారేదీ లేదు మరి!

* * *

టీ తాగి బయటకొస్తుండగా "నమస్కారం కామ్రేడ్" ఎర్ర చొక్కా హుషారుగా విష్ చేసింది.

సుబ్బారావుకు ఏం చెయ్యాలో పాలుబోలేదు. ఏమయితే అదయ్యింది లెమ్మనుకుని... "ప్లీజ్! ఒక్క అరగంట వెయిట్ చేస్తారా...! మా ఆఫీసుకు ఓ సారెళ్ళి సెలవు చెప్పి వచ్చేస్తా! లేకుంటే నా పని అవుటే!" రిక్వెస్ట్ చేశాడు.

"ఏంటి.. మీ ఆఫీసరు భూస్వామా?" ఎర్ర చొక్కా వేడిగా అడిగింది.

"నిజమే... మీకెలా తెల్సు?" అంతే– సుబ్బారావు దొరికిపోయాడు.

"ఎస్... మీకన్నీ తెలుస్తాయి. అసలు భూస్వామ్య వ్యవస్థను మనం సమూలంగా రూపుమాపాలి. మనుషులందరూ సమానులే. అందరికీ సమాన హక్కులున్నాయి. ఒకళ్ళు ఎక్కువ! మరొకళ్ళు తక్కువ... కాంట్ టాలరేట్...! అసలు ఇటువంటి వ్యవస్థపైనే మనం పోరాడాలి. మొన్న రష్యాలో ఏమయ్యింది. ఏమో నాకే తెలియదు. ఇంక మీకేం తెలుస్తుంది లెండి! పోతే– నవనాగరికతా సమాజపు కొత్త ట్యూబ్‌లైట్ వెలుతురు కోసం పాత నాగరికత తాలూకు హరికన్ లాంతర్లను ముందుగా ఆర్పేద్దాం...




ఏమంటారు?" ఎర్రచొక్కా ఏకంగా రెండు గంటలసేపు ఏకధాటిగా వాయించేసి మంచినీళ్ళకోసం ఆగుతూ ఓ చిన్న ప్రశ్నొదిలాడు.

సుబ్బారావుకు తల తిరుగుతోంది. తిరుగుతున్న అతని కళ్ళకు ఆఫీసరు పెద్ద పెద్ద కోరలతో, గంగాళం లాంటి నోటితో, మండుతున్న కళ్ళతో, పొగలొస్తున్న ముక్కుతో, దొప్ప చెవులతో భయంకరంగా కన్పిస్తున్నాడు.

కాస్త నీరసంగా– "నేను మాత్రం ఏం చెప్పగలనండి. మీరేమంటే నేనూ అదే అంటానండి." సుబ్బారావు సమాధానమిచ్చాడు.

ఎర్ర చొక్కా కోరుకునే సమాధానమదే! వెంటనే "వెరీగుడ్! మరింక మేం వెళ్ళొస్తాం. రేపు మళ్ళీ ఇదే వేళకి అచ్చం ఇలాగే కలుసుకుందాం! సరేనా కామ్రేడ్... నమస్కారం. సెలవు" ఎర్ర చొక్కా కాలరు సర్దుకుంటూ వెళ్ళిపోయింది.

గడియారం ఏడుసార్లు గంట కొట్టింది.

* * *

'ఏమిటిలా...ఇలా అయితే ఆఫీసరు చేత తినరాని తిట్లన్నీ తినాల్సి వస్తుందే...' సుబ్బారావు బాధ వర్ణనాతీతం. ఈ హింస తప్పేదెలా? ఇదే అతని ఆలోచన.

ఎదురుగ్గా దూరదర్శన్ రొద పెడుతోంది. చంటాడికి ప్రోగ్రాం నచ్చలేదేమో– టక్ మంటూ స్విచ్ కట్టేశాడు.

ఆలోచిస్తున్న సుబ్బారావుకు ఫ్లాష్ వెలిగింది. వెంటనే అమల్లో పెట్టేశాడు.

* * *

మర్నాడు పొద్దున్నే– గేటు తలుపుకు ఓ బోర్డు వేలాడుతోంది. దానిపై

"న'మస్కా'రాయుళ్ళకో నమస్కారం!"

ప్లీజ్... మా ఇంటికి రాకండి..! మమ్మల్ని హింసించకండి! అహింసావాదులకే మా ఓటు! ఇది గ్యారెంటీ!!"

– మల్లాది కామేశ్వరరావు